క్లుప్తంగా

రైతు సంక్షేమమే లక్ష్యం



మదనాపురం: మండలంలోని నర్సింగాపురం, నెలివిడిలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం రేవంత్ సర్కార్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం రేషన్‌షాపులో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. పేదలు ప్రభుత్వం నుంచి అందే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగన్న, తిరుపతిరెడ్డి, లిఫ్టు చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3, 4 ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రం చేయడమే కాకుండా స్వచ్ఛభారత్– శ్రమదానం పాటించి, ముళ్లకంప, చెత్తను తొలగించినట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ధామ్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రోగాం సహాయ కోర్డినేటర్ వెంకటస్వామి, కార్యదర్శి రాజేష్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలి



వనపర్తి టౌన్: యువత మహనీయుల జీవిత స్ఫూర్తితో సమాజంలో ఉన్నతంగా ఎదగాలని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం మంగళ్ పాండే, బంకించంద్ర ఛటర్జీ, శంకరంబాడీ సుందరాచార్య, వేములపల్లి శ్రీకృష్ణుల వర్ధంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, బాలేమియా, ఉపాధ్యాయుడు స్వామి, కుశకుమార్, తిరుపతయ్య, ఎస్.భాస్కర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



మదనాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా విడుదలయిన రూ.5లక్షలతో మండలంలోని తిరుమలయ్యపల్లిలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణానికి బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరు చేయించడంలో ఎంపీ డీకే అరుణ పాత్ర ఉందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబుగౌడ్, వెంకటేశ్వర్లు శెట్టి, ఆంజనేయులు, వడ్డె రాజు, చంద్రన్న గౌడ్, రమేష్, శ్రీనివాసులు, కురుమన్న, వెంకటయ్య, బురాన్, యాదగిరి, కొండన్న, ఆంజనేయులు, గోవిందు పాల్గొన్నారు.

‘కూలి పెంచాలి’

వీపనగండ్ల: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించి, కూలి రేట్లు రెట్టింపు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్వరాల శివారులో ఉపాధి పని ప్రదేశాన్ని సందర్శించి, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచుతున్న కేంద్రం ప్రభుత్వం ఉపాధి కూలి రేట్లు పెంచకపోతే పేదలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉపాధి కూలీలను సమీకరించి రాబోయే రోజుల్లో ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

టెక్నికల్ ఆఫీసర్‌కు సన్మానం

వీపనగండ్ల: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన మధుగని నరేష్‌యాదవ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా ఇరిగేషన్ శాఖలో ఉద్యోగాన్ని సంపాదించాడు. దీంతో మంగళవారం నరేష్‌ను యాదవ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురుమయ్య, ఎత్తం కృష్ణయ్య, బత్తుల యాదయ్య, ముంత మల్లయ్య, వెంకటయ్య, వీరబాబు, కృష్ణయ్య, బాలరాజు, గంగులీయాదవ్, శివయాదవ్ ఉన్నారు.

గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలి



తల్లులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: గర్భిణుల ఆరోగ్యం, పోషకాహారం ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. ఏప్రిల్ 8 నుంచి 22 నిర్వహించనున్న పోషణ్ పక్వాడ (పోషణ పక్షం) కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల విషయంలో రక్తహీనత అనేది ప్రధాన సమస్య అని, దానిని పోషకాహారం ద్వారానే ఎదుర్కోగలమని, ఈ అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఖచ్చితంగా గర్భిణులకు హిమోగ్లోబిన్ 12 నుంచి 13 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకునే గర్భిణులు, బాలింతలకు వివరించాలన్నారు.

పిల్లల శారీరక ఎదుగదలకు..

గర్భిణులు బిడ్డలకి జన్మనిచ్చిన తర్వాత పిల్లలకు తొలి రెండేళ్లు కీలకమని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాల ద్వారానే పిల్లల్లో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తూ తల్లీబిడ్డల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. చిన్నారుల బరువు, ఎత్తు ఎప్పటికప్పుడు చూస్తూ.. బలహీనంగా ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి పిల్లవాడికి సంబంధించిన ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా పిల్లలు రోగాల బారిన పడకుండా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

అందుబాటులో ట్రాకర్ అప్లికేషన్..

గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోషణ ట్రాకర్ అప్లికేషన్ కూడా వినియోగించాలన్నారు. ఈ పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించిన వారికి రాబోయే రోజుల్లో అవార్డులు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పోషకాలు కలిగిన ఆహార పదార్థాల స్టాల్‌ను కలెక్టర్ తిలకించారు. అనంతరం బాలింతలకు బాలామృతం అందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులు, ఇతర సదుపాయాల గురించి ప్రధానోపాధ్యాయులతో ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు టాయిలెట్లు నిర్మించాలని ఆదేశించా. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహం, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, అధికారులు ఉన్నారు.

‘కొత్తకోటను రెవెన్యూ డివిజన్ చేయాలి’



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: కొత్తకోటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి స్థానిక కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పుడున్న రెవెన్యూ డివిజన్‌లోని పలు మండలాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కొత్తకోట ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు మంత్రి, స్పీకర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు డాక్టర్ పీజే బాబు, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌జే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, లతీఫ్, మాసన్న, శివరాములు, శివరాజ్, నాగరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు



పాన్‌గల్‌లో రేషన్‌షాపును పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి



ఈర్లదిన్నెలో..

పాన్‌గల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీలో రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని ఆయన సందర్శించి, స్టాక్ రిజిస్టర్లు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందే నాణ్యమైన బియ్యాన్నే అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేష్, డీలరు తదితరులు పాల్గొన్నారు.

ఈర్లదిన్నెలో..

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా అందిస్తున్న ఉచిత సన్నబియ్యాన్ని మంగళవారం మాజీ సర్పంచ్ చుక్క ఆశిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సన్నబియ్యంను అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు కుర్మన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రఘురామారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ రేవల్లి మండల అధ్యక్షుడు రఘురామారావు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మంగళవారం రేవల్లి మండలంలోని కేశంపేటలో అంత్యక్రియలు నిర్వహించగా.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేసే వాడని, సీనియర్ నాయకుడిని కోల్పోవడం బాధాకర విషయమని వాపోయారు. అంత్యక్రియల్లో మాజీ మంత్రి జనార్దన్‌రెడ్డి, నాగం తిరుపతిరెడ్డి, వాకిటి శ్రీధర్, సన్నిహితులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆటో మల్లయ్య భార్య పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగేంద్రం, భాస్కర్‌రెడ్డి, సురేష్ శెట్టి, నరేందర్‌గౌడు, కరాటే గోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు..

జమ్మాపూర్‌లో పార్వతమ్మ కుటుంబాన్ని మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటయ్యనాయుడు, జ్యోతినందన్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, నిరంజన్‌రెడ్డి, రమేష్‌నాయక్, నవీన్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సవారమ్మ బోనాలు



వనపర్తి రూరల్: మండలంలోని మెంటపల్లిలో సవారమ్మ బోనాల పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు కనుకరించి పాడి పంటలు సమృద్ధిగా పండటంతో పాటు, పిల్లలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వడదెబ్బ నివారణపై ప్రజలను చైతన్యం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. అన్ని సబ్‌సెంటర్లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులు మధుమేహ స్క్రీనింగ్, ఆన్‌లైన్‌లో నమోదు గురించి, మిషన్ ఇంద్రధనస్సు, పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంపు అంశాలపై సమావేశంలో చర్చించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచాలి

పాన్‌గల్: భవన నిర్మాణ కార్మికుల ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి మోష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కేతేపల్లిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా రెండో మహాసభలను జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీహరి ఏఐటీయూసీ అరుణ పతకాన్ని ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తాపీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచి నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు 70 శాతం సబ్సిడీపై పనిముట్లు, 60 ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. అనంతరం 15 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

జిల్లా అధ్యక్షుడిగా చిన్న కుర్మయ్య ఎన్నిక

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా చిన్న కుర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, కుమ్మరిరాములు, సమాయ కార్యదర్శులుగా బాలరాజు, ఆనంద్, కోశాధికారిగా మహేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా చిన్న వెంకటేష్, 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు భరత్, గోపాలకృష్ణ, కళావతమ్మ, కుతుబ్ ఉన్నారు.

గోపాల్‌పేటలో రెండు చోరీలు

గోపాల్‌పేట: మండల కేంద్రంలో సోమవారం రాత్రి రెండు చోరీలు జరిగాయి. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని చెంద్రాయునిగడ్డ కాలనీకి చెందిన సొడమోని సుజాత, బాల్‌రాం దంపతులు సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రించగా.. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు సుజాత మెడలో నల్లపూసల దండకు ఉన్న 24 బంగారు పలకలు, బంగారు పుస్తెలతాడు దొంగిలించారు. మంగళవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

కిరాణం షాపులో..

మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన కోడిగంటి నరసింహ సోమవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో తన కిరాణ షాపుకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం షాపు వద్దకు రాగా తాళం తెరుచుకుని కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా సిగరెట్ ప్యాకెట్లు, రూ.మూడు వేలు, సెల్‌ఫోన్ చార్జర్లు, స్పీకర్ పోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాలనీలో విద్యుద్దీపాలు లేకపోవడంతో చీకటిగా ఉండడాన్ని దొంగలు ఆసరాగా చేసుకున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లైట్లు బిగించాలని అధికారులు పట్టనట్లు వ్యవహరించారని స్థానికులు ఆరోపించారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా లైట్లు వేయాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటుగా మానసిక అంగవైకల్యం, చిన్నారుల బరువు పరిశీలించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు మందులు అందించడంతో పాటుగా వారు తీసుకోవాల్సిన ఆహారం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ రఘు, డాక్టర్ స్వప్న మాట్లాడుతూ షౌష్టికాహార లోపం వల్లనే చిన్నారులు కొందరు బరువు తక్కువగా ఉండటం, బలహీనంగా ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, ఫార్మసిస్టు లక్ష్మి, అర్జున్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి కంటి పరీక్షలు చేయించాలి

కొత్తకోట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే ప్రతి చిన్నారికి కంటి వైద్య పరీక్షలు చేయించాలని డీఐఓ డాక్టర్ పరిమళ చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం– 1లో కంటి వైద్య శిబిరాన్ని డీడబ్ల్యూఓ సుధారాణితో కలిసి డాక్టర్ పరిమళ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఐఓ మాట్లాడుతూ 6 నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు జిల్లాలో 16 వేల మంది ఉన్నారని, వారందరికి కంటి, మానసిక, శారీరక ఎదుగుదల, చురుకుదనం, బరువు, ఎత్తు వంటి పరీక్షలు నిర్వహిస్తామని డీడబ్ల్యూఓ సుధారాణి అన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు తీసుకొచ్చి కంటి, ఇతర పరీక్షలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మమ్మ, పర్యవేక్షకురాలు కవిత, ఆర్‌బీఎస్‌కే వైద్యులు మతీన్, మురళి, అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి, చిన్నారుల తల్లులు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ



ప్రిన్సిపాల్ కిరణ్మయిని సన్మానిస్తున్న కార్మికులు

వనపర్తి రూరల్: తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ కిరణ్మయిని శాలువాతో సన్మానించారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు, కనీస వేతనం రూ.24 వేలు, నూతన టెండర్ పాలసీ ప్రకటించాలని రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం వైద్య ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక అధ్యయనం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోహిణి, యూనియన్ వరుణ్, శేఖర్, సైదాబేగం, మన్నెమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, బొజ్జమ్మ, లత, నారమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి హన్మంతు పిలుపునిచ్చారు. ఈ నెల 8న అఖిల భారత నిరసన దినంగా పాటించాలని మాస్‌లైన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం తమ జీవిత భద్రత, వేతనం, హక్కుల కోసం, రైతాంగం గిట్టుబాటు ధర, ఎమ్మెస్పీ చట్టం, నూతన వ్యవసాయ చట్టం రద్దు పర్చాలని పోరాడుతోందన్నారు. దేశంలో 20 కోట్ల మంది యువత ఉద్యోగాలు లేక రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గణేష్, రాజు, కురుమన్న, వెంకటయ్య, వెన్నెల, చింతలన్న, భక్తి, జిలాని, వినోద్, వెంకటేష్, ఆనంద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధర పెంపుపై వామపక్షాల నిరసన



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



పాన్‌గల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో..

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, లక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ పేదల నడ్డి విరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన ధరలు పెంచి పేదలపై భారం మోపిన ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా సిలిండర్‌పై రూ.50 పెంచడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి మారకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మదన్, రమేష్, బీసన్న, రాములు, బాలరాజు, మన్యం, రత్నయ్య, పుల్లయ్య, గొర్ల భాస్కర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కేంద్రం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్‌ను రోడ్డుపై ఉంచి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జయరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, మోష, గోపాలకృష్ణ, శ్రీహరి, కుతుబ్, కుర్వ హన్మంతు, చిన్న కుర్మయ్య పాల్గొన్నారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచి పేదల నడ్డి విరిచిందని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం పెంచిన డీజిల్, వంట గ్యాస్, పెట్రోల్ ధరలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అనురాగ్, మార్టిన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశం గర్వించేస్థాయికి ఎదగాలి

ఆత్మకూర్: విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ వారు నిర్వహించిన క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా.. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువులో రాణించాలని సూచించారు. చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రాంబాబు, ఎస్ఐ ఆనంద్

కొత్తకోట రూరల్: త్రైత శకం 47వ సంవత్సర తెలుగు ఉగాది క్యాలెండర్‌ను కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ ఆనంద్‌లో కలిసి ఆవిష్కరించినట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి కొత్తకోట మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామివారు రచించిన జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా రూపొందించినట్లు వివరించారు. ఈ కాలసూచికలో ఆలయం, సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగలు, నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకాల సారాన్ని పొందుపర్చారన్నారు. తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరచి తయారు చేసిన కాలసూచికను ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్‌రెడ్డి, ముజాఫర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భారతి

సాక్షి, నెట్‌వర్క్: చిరుధాన్యాలతో కూడిన పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీఓ బాలీశ్వరి, సూపర్‌వైజర్ భారతి సూచించారు. పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ ఒకటో కేంద్రంలో, మదనాపురం మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి గ్రామాల్లో, వీపనగండ్ల మండలంలోని పలు గ్రామాల్లో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా పుడతారన్నారు. 6 నెలలు వచ్చే వరకు చిన్నారులకు తల్లిపాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ రూన్సీలక్ష్మి, ఏడబ్ల్యూహెచ్ సుజాత, జానకి, అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయి, మహేశ్వరి, సువర్ణ, ఎల్లమ్మ, కమల, పారిజాత, కవిత, తారమ్మ, సువర్ణ, సుజాత, హంసమ్మ, హెల్పర్లు లచ్చమ్మ, నిరంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.